గణపయ్యకు విశేష సేవలు

- శోభాయమానంగా శత కలశ ఊరేగింపు
- వైభవంగా చిన్నశేష వాహనంపై వరసిద్ధుడి విహారం

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. నాల్గవ రోజున ఉదయం చిన్నశేష వాహనంపై సిద్ధి, బుద్ధి సమేత విఘ్నేశ్వరుడు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శత కలశాభిషేకంలో భాగంగా 1,116మంది దంపతులు పాల్గొని కలశాలతో ఆలయ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ శోభాయమానంగా సాగిన ఈ శత కలశాభిషేక మహోత్సవ ఊరేగింపు కార్యక్రమంలో సుమారు 5వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు డాక్టర్ కలికిరి మురళీమోహన్, గురజాల జగన్‌మోహన్‌లు ఊరేగింపు సందర్భంగా హాజరై కలశాలతో ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా తేనే, నెయ్యి, పాలు, పెరుగు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా అభిషేకాలు చేపట్టారు. తదుపరి పుష్పయాగం నిర్వహించారు. ఆలయ ఈవో గురుప్రసాద్ భక్తులకు కావలసిన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఫలించిన ఉపాధ్యాయ సంఘాల పోరాటం

ఉపాధ్యాయ సమస్యలపై కలెక్టర్‌తో చర్చిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జెడ్పీ పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఫ్యాప్టో నేతృత్వంలో యుటిఎఫ్, ఎస్‌టియు, ఏపీటీఎఫ్ నాలుగేళ్ళ పాటు సుదీర్ఘ పోరాటం ఫలించింది. ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల్లోని డబ్బులను జిల్లా పరిషత్ ఆన్‌లైన్ ఖాతాల్లో జమ చేయాలంటూ జెడ్పీ కార్యాలయం, జిల్లా విద్యాశాఖ కార్యాలయాల ఎదుట నాలుగు సంవత్సరాలుగా పోరాటాలు సాగించారు. సంబంధిత జిల్లా అధికారులకు కలెక్టర్‌కు వినతులు ఇచ్చారు. ఉపాధ్యాయ సంఘాల పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. చిత్తూరు కలెక్టర్ చొరవ తీసుకొని ఉపాధ్యాయ సంఘాల నేతలతో చర్చలు జరిపారు. పీఎఫ్ నిధి జిల్లా పరిషత్ ఆన్‌లైన్ ఖాతాల్లో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాయుల సమగ్ర సీనియారిటీ, రెగ్యులరైజేషన్ జాబ్ జాబితాల రూపకల్పన జరగనుంది. వేలూరు, చిత్తూరు, రాణిపేట సిఎంసి క్యాంపస్‌లలో చికిత్స పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మెడికల్ రియంబర్స్మెంట్ పొందనున్నారు. కారుణ్య నియామకాలు, ఉపాధ్యాయుల సర్దుబాటుపై క్యాల్టీ వచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మండల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల స్థలాలను సర్వే చేసి రెవిన్యూ రికార్డుల్లో నమోదు చేయనున్నారు.

జిల్లా కలెక్టర్ చొరవ అభినందనీయం

జిల్లాలో 12వేల మంది ఉపాధ్యాయుల సమస్య తీరినట్లే.. నాలుగేళ్ళ సుదీర్ఘ పోరాటం ఫలించింది. నాలుగు సంత్సరాలుగా పీఎఫ్ ఖాతాల విషయంలో జిల్లా పరిషత్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురికాల్సి వచ్చింది. ఉపాధ్యాయ ప్రతినిధి బృందాన్ని విజయవాడకు పంపి 15రోజుల్లో పీఎఫ్ వివరాలు ఆన్‌లైన్‌లో చూపేలా ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ కృషిని జిల్లాలో ఉపాధ్యాయులు అభినందిస్తూ యుటిఎఫ్ ధన్యవాదాలు తెలుపుతోంది.

-జివి. రమణ, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

మెడికల్ రీయింబర్స్‌మెంట్ సాధించాం..

పీఎఫ్ ఖాతా నిధి జిల్లా పరిషత్ ఆన్‌లైన్ ఖాతాల్లో బహిర్గతం చేయడం ద్వారా మెడికల్ రియంబర్స్‌మెంట్ పొందే అవకాశం ఉంది. ఉపాధ్యాయుల సర్దుబాటులో చోటు చేసుకున్న లోపాలను సరిచేయాలంటూ పోరాటం చేయడం జరిగింది. పోరాటం ఫలితంగా సమస్యలను పరిష్కరించుకోవడం జరిగింది.

-సోమశేఖర్‌నాయుడు
యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

ఎంపి ల్యాడ్స్ పనులు ప్రాధాన్యతగా పూర్తి చేయండి

- కొత్తగా మంజూరయ్యే పనులను త్వరగా గ్రౌండింగ్ చేయండి
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: గత ఐదు సంవత్సరాలలో ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరైన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రస్తుతం మంజూరైన పనులను త్వరితగతిన ప్రారంభించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో కలెక్టర్ ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన, చేపట్టనున్న పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీ ల్యాడ్స్ నిధులతో సిసి రోడ్లు, డ్రైనేజీలు, బస్ షెల్టర్లు, కమ్యూనిటీ హాల్స్ తదితర అభివృద్ధి పనులు ప్రాధాన్యతగా పూర్తి చేయాలన్నారు. ఇందులో భాగంగా గతంలో ఎంపీ ల్యాడ్స్ కింద రూ.9 కోట్లతో 172పనులు మంజూరు కాగా ఆ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పనులు పూర్తయిన వెంటనే అందుకు సంబంధించిన పిల్లలు అప్లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. కోటి 69లక్షలతో 37పనులు మంజూరు చేయడం జరిగిందని, ఆ పనులను కూడా వెంటనే ప్రారంభించాలన్నారు. గతంలో మంజూరై పురోగతిలో ఉన్న పనులకు సంబంధించి పిఆర్, మున్సిపాలిటీలో చేపట్టిన పనుల పురోగతిపై సంబంధిత శాఖ అధికారులతో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్ కుమార్, సిపిఓ సాంబ శివా రెడ్డి, పిఆర్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డిపిఓ లక్ష్మి విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి శ్రీనివాస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

కలెక్టర్‌కు చెక్కును అందిస్తున్న చిల్డ్రన్స్ అంకాడమి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వరద బాధితుల సహాయార్థం పుంగనూరుకు చెందిన రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ స్కూల్ తరపున ఆర్థిక సాయాన్ని ఇచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి రూ.25వేల చెక్కును అందజేశారు.

మహిళా పోలీసులకు పోస్టింగ్స్

పోస్టింగ్‌లు కేటాయిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసు కార్యాలయములో గల కాన్ఫరెన్స్ హాల్‌లో చిత్తూరు జిల్లా ఎస్పీ గ్రామవార్డు మహిళా పోలీస్ కౌన్సిలింగ్‌కు 140మంది హాజరయ్యారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఉద్యోగార్థుల అభీష్టం మేరకు 49మందికి పోస్టింగు కేటాయించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కెయంవి మోహన్ రావు, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు, క్లర్క్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవం

స్వర్ణోత్సవాలకు సిద్ధం అవుతున్న ప్రభుత్వ కళాశాల

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: గుడిపాల మండలం బొమ్మసముద్రం గ్రామంలో 1974 ప్రభుత్వ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పడి 2024 సంవత్సరానికి 50 సంవత్సరాలు పూర్తైంది. ఈ సందర్భంగా ఈనెల 13వ తేదీ ఉదయం 10గం టలకు బొమ్మ సముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవం కార్యక్రమం జరగనుంది. కార్యక్రమానికి ఎంపి, ఎమ్మెల్యే, జెడ్పి ఛైర్మెన్ హాజరుకానున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శరత్‌చంద్ర శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆసుపత్రి, ల్యాబ్, క్లినిక్‌లకు రిజిస్ట్రేషన్ తప్పని సరి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆసుపత్రి, క్లినిక్, ల్యాబ్‌లు మాత్రమే ప్రాక్టీస్ చేయాలని ఆర్‌డిఓ చిన్నయ్య అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో పీసీపిఎన్‌టిడి కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో రిజిస్టర్ చేసుకున్న ఆసుపత్రి, లాబ్, క్లినిక్ వాళ్ళు మాత్రమే ప్రాక్టీస్ చేయాలని, రిజిస్టర్ కానివారు చేసినట్లయితే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే గర్భిణీ స్త్రీలకు అబార్షన్ రిజిస్టర్ కాని వారు చేసినట్లయితే శిక్షలు తప్పవని హెచ్చరించారు. స్కాన్ సెంటర్లలో రిజిస్టర్ కాబడిన రేడియాలజిస్ట్ మాత్రమే స్కాన్ చేయాలన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ చేసినట్లయితే పిసిపిఎన్‌డిటి ఆక్ట్ ప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష రూ.పదివేల జరిమానా, సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం లింగ నిష్పత్తి 1000బాలురకు 883బాలికలు మాత్రమే ఉన్నట్లు చెప్పారు. దీనిని ఈక్వల్ చేయవలసిన ఆవశ్యకత మనందరిదేనని చెప్పారు. అలాగే మెడికల్ షాప్‌లలో పారాసిటిమోల్ మాత్ర తప్ప మిగతా ఏ మెడిసిన్ అయినా ప్రిస్క్రిప్షన్‌తోనే ఇవ్వాలని సూచించారు. కాని పక్షంలో శాఖపరమైన చర్య తీసుకోనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రకృతి వ్యవసాయన్ని పరిశీలిస్తున్న ఒసిబ్బంది

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా స్థాయిలోని వ్యవసాయ శాఖ సిబ్బంది డీపీఎంయూ సిబ్బంది అందరికి బుధవారం ఓరియంటేషన్ వర్క్‌షాప్ నిర్వహించి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బంగారుపాళ్యం మండలం కల్లూరుపల్లి గ్రామంలో, చిత్తూరు మండలం బంగారెడ్డిపల్లి గ్రామంలో క్షేత్ర సందర్శనలో చిత్తూరు మోడల్స్, పీఎండీస్, వరిలో, వేరుశెనగలో ఏ-గ్రేడ్, ఎటిఎం మోడల్స్, సూర్య మండలం మోడల్,క్షేత్ర సందర్శన చేయడం జరిగింది. ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, సీడ్ పెల్లటైజేషన్ డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, అన్నీ మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా వనరుల కేంద్రం అధికారిని నాగపద్మిని, ప్రాజెక్ట్ మేనేజర్ వాసు, డీపీఎంయూ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- సీనియర్ సివిల్ కోర్టు జడ్జ్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు సీనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అధాలత్‌ను ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు జడ్జ్ శ్రీనివాస రావు తెలిపారు. అదాలత్‌ను కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసుశాఖ అధికారులు కలసి విజయవంతం చేసేందుకు తోడ్పడాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరులతో జడ్జ్ మాట్లాడుతూ.. జూనియర్ సివిల్ కోర్ట్, సబ్ కోర్ట్ ఆవరణలోని స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో ఎన్నో ఏళ్లుగా కక్షిదారులకు సంబంధించిన పెండింగ్లో ఉన్న పలు కేసులను న్యాయవాదులు, పోలీసులు సమన్వయంతో కలిసి కేసుల పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలన్నారు. రాజీమార్గమే రాజమార్గమని కక్షిదారులు వీటిని గుర్తించి ఇరు పార్టీలు సమన్వయంతో ఆవేశాలకు గురి కాకుండా కేసులు పరిష్కారానికి ముందుకు రావాలని ఆయన కోరారు.

హరిబాబుకు 'దళిత వీర్' అవార్డు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, దళిత బహుజన ఫ్రంట్ రాయలసీమ కో-ఆర్డినేటర్ నత్తం హరిబాబు ప్రతిష్టాత్మక 'దళిత వీర్' అవార్డును అందుకున్నారు. గుంటూరులోని అరండల్ పేట ఎస్సి, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన 'దళిత పల్లెవీరుల మహోత్సవం'ను పురస్కరించుకుని హరిబాబుకు అవార్డును అందజేయడం జరిగింది. చుండూరు దళిత పోరులో అమరుడైన కొమ్మెర్ల అనిల్ కుమార్ స్ఫూర్తితో దళిత, మానవ హక్కుల పరిరక్షణకు అంకితభావంతో విశేష కృషి చేస్తున్న దళితులకు ఈ 'దళిత వీర్' అవార్డును ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా అందిస్తున్నారు. ఆ కోవలో తన వంతు కృషి చేస్తూ దళిత బాంధవుడు అంబేడ్కర్ భావజాలంతో ముందుకెళ్తున్న హరిబాబుకు 'దళిత వీర్' అవార్డును బహూకరించడం జరిగింది. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, మాజీ మంత్రి డొక్కామాణిక్య వరప్రసాద్ చేతుల మీదుగా హరిబాబు అవార్డును అందుకున్నారు. హరిబాబుకు 'దళిత వీర్' అవార్డు రావడం పట్ల పలువురు సీనియర్ పాత్రికేయులు, పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి మేళం భాగ్యారావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు భూపతి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఘంటసాల సినిమాకు వినోదపు పన్ను రాయితీ ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తెలుగువారు మరచిపోలేని మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పేరుపై నిర్మించిన సినిమాపై వినోదపు పన్ను రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.ఘంటసాల సినిమాను సిహెచ్ రామారావు నిర్మించగా, అత్యంత సామాన్యుడైన సిహెచ్ పవన్ అనే వ్యక్తి ఘంటసాలపై ఉన్న అభిమానంతో తన రిటైర్మెంట్ డబ్బులు వెచ్చించి సినిమాను అద్భుతంగా తీశారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు సినిమాను రిలీజ్ చేయడానికి కూడా నిర్మాతలు ఇబ్బంది పడుతున్నారని ఇలాంటి సినిమాలను ప్రభుత్వమే బాధ్యత తీసుకొని విడుదల చేయాలని కోరారు. పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు ఐదు భాషలలో తన మధుర కంఠాన్ని వినిపించారని అలాంటి గాయకుడిపై తీసిన చిత్రం విడుదలకు నోచుకోకపోవడం సమంజసం కాదని, ఆయనకున్న గౌరవాన్ని కాపాడాలని, తెలుగువారు ప్రతినిత్యం స్మరించుకునే వ్యక్తి ఘంటసాల అని ఆయన గుర్తు చేశారు. ఘంటసాల పాడిన పాటలు ప్రతినిత్యం తిరుమల కొండపై మార్మోగుతుంటాయని టీటీడీ ఆస్థాన విధ్వంసకుడిగా పనిచేసిన ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రానికి టీటీడీ లాంటి సంస్థలు తోడ్పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శ్రీకాళహస్తీశ్వరాలయ అభివృద్ధికి నిధులు

కేంద్రమంత్రి సురేష్ గోపి



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి పరిచేందుకు అవసరమైన నిధులను కేటాయిస్తామని కేంద్ర పెట్రోలియం, పర్యాటక శాఖా మంత్రి సురేష్ గోపి హామీ ఇచ్చారు. బుధవారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టిడిపి నేత రంగినేని చెంచయ్య నాయుడు సురేష్ గోపికి ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు చేసుకున్నారు. స్వామీఅమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి వద్ద వేదపండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు జ్ఞాపికలను అందజేశారు. అనంతం బిజెపి, టిడిపి నేతలు శ్రీకాళహస్తీశ్వరాలయ అభివృద్ధికి రూ.140 కోట్లు, గుడిమల్లం పరుశు రామేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 22 కోట్లు కావాలని ప్రతిపాదన పెట్టగా మంత్రి సానుకూలంగా స్పందించి తప్పకుండా సాయం చేస్తామంటూ హామీ ఇచ్చారు.

ఘనంగా జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరులోని అటవీశాఖ కార్యాలయం వద్ద బుధవారం జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సబ్ డిఎఫ్ఓ వేణుగోపాల్, ఎఫ్ఆర్‌వో శివన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ.. అటవీశాఖలో పనిచేస్తున్న ఎంతోమంది అమరవీరులయ్యారని అలాంటి వారిని మనం ప్రతి సంవత్సరం స్మరించుకోవడం విధితమే అన్నారు. అలాంటి వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. అటవీ ప్రాంతంలో ఉన్న సంపదతో పాటు వన్యప్రాణులను కూడా కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లేటప్పుడు ఏనుగులను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తలు పాటించాలన్నారు. మనందరినీ నమ్ముకొని కుటుంబ సభ్యులు ఆధారపడి జీవిస్తుంటారన్నారు. మనల్ని మనం రక్షించుకొని జంతువులను, అటవీ సంపదను కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అటవీ శాఖలో పనిచేస్తూ చనిపోయిన వారి ఆత్మకుశాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో డివైఆర్‌ఓ వేణుగోపాల్ రెడ్డి, ఎఫ్ఎస్ఓలు సురేంద్ర, అరుణ్ బాషా, గార్డు రాధాకృష్ణ, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి- తిరుమల: కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ బుధవారం తిరుమలలోని శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గవర్నర్‌కు టీటీడీ అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో శ్రీవారి ప్రసాదం, టీటీడీ క్యాలెండర్, ఫొటోను అందజేశారు. అలాగే కేంద్ర పర్యాటకశాఖ మంత్రి సురేష్ గోపి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత స్వామివారి దర్శనానికి కుటుంబంతో కలిసి వచ్చానని పుష్కరకాలం తర్వాత స్వామిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసారు. దేశంలో పర్యాటక రంగాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కేరళలో పర్యాటక రంగం తిరిగి పుంజుకుంటోందని తెలిపారు.

పెట్టుబడి సాయమేది చంద్రబాబు : రైతు సంఘం

సచివాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచిపోయింది. మరి రైంతాగానికి ఇస్తానన్న రూ.20 వేలు పెట్టుబడి సాయమేదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత ప్రశ్నించారు. రైంతాంగం సమస్యలు, గత ఎన్నికల హామీల అమలుపై స్థానిక ఎస్డీకే నగర్ సచివాలయం వద్ద రైతు సంఘం నాయకులు బుధవారం నిరసన తెలియజేశారు. అనంతరం హేమలత మాట్లాడుతూ గత ఎన్నికల్లో రైతులు, కౌలు రైతుల మద్దతుతో ఎన్డీఏ కూటమి భారీ మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. అయితే రైతులకు అండగా ఇస్తానన్న పెట్టుబడి సాయాన్ని ఇంతవరకు విడుదల చేయలేదని మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ పథకం కార్యచరణ కూడా ఇప్పటివరకు ప్రకటించకపోవడం బాధాకరమని ఆవేదన చేశారు. చంద్రబాబు పెట్టుబడి సాయాన్ని విడుదల చేసి ఉంటే రైతులు, కౌలు రైతులు పెట్టుబడి కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. అంతేకాకుండా 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లలో కరువు, తుఫాన్‌లతో నష్టపోయిన పంటలకు బీమా పరిహారం ఇవ్వాలనీ, సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.2లక్షల వరకు రైతుల రుణాలు రద్దు చేయాలనీ, వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టే జీఓ 22 రద్దు చేయాలని కోరారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలనీ, అన్ని రకాల రైతు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గూడూరు పరిధిలో మల్లిపల్లి మడుగు ప్రాజెక్టు, శ్రీకాళహస్తి పరిధిలో సోమశీల స్వర్ణముఖి ప్రాజెక్టు పూర్తిచేసి శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజక వర్గాల ప్రజలకు తాగు, సాగునీరు అందిచాలని సూచించారు. పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టు మరమ్మతులకు జైకా నిధులను కేటాయించి సత్వరం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కెవిబిపురం మండలంలో ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులకు సాగునీరు అందించాలనీ, తలకోన నీటిని వృథా కాకుండా సమీప చెరువులకు మళ్లించి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. పాడి రైతులకు శ్రేయస్కరంగా ఉండే గొర్రెలు, మేకలు, పశువుల షెడ్లను పార్టీలకతీతంగా నిర్మించే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలనీ, ధాన్యం ఆరబెట్టుకోవడానికి ప్రతి పంచాయతీలో కల్లాలు, నిల్వ చేసుకోవడానికి గోదాములు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సచివాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తమిళనాడు నుంచి 300 సర్వీసులు

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: అక్టోబర్‌లో నిర్వహించే తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తమిళనాడు నుంచి ఏపీఎస్ ఆర్టీసీ తమిళనాడు ఆర్టీసీకి చెందిన 300 బస్ సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. స్థానిక జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో టీఎన్‌ఆర్టిసి, ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే బస్ సర్వీసులపై బుధవారం చర్చించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ నుంచి 150 బస్ సర్వీసులు, తిరుపతి చెన్నై వయా ఊతుకోటపై 30 సర్వీసులు, తిరుపతి- కంచి 20, తిరుపతి- చెన్నై వయా శ్రీకాళహస్తి 5, తిరుపతి తిరునామలై 10, తిరుపతి వేలూరు 65, తిరుపతి- క్రిష్ణగిరి 15, తిరుపతి- హెూసూర్ 5 సర్వీసులు నడపనున్నారు. తమిళనాడు ఆర్టీసీ ఆధ్వర్యంలో కల్లకరిచి తిరుపతి మధ్య 10, విల్లుపురం -తిరుపతి 8, పాండిచ్చేరి- తిరుపతి 10, వేలూరు - తిరుపతి 25, తిరుపత్తూరు- తిరుపతి 10, తిరునామలై - తిరుపతి 8, చెన్నై - తిరుపతి వయా తిరుత్తని మీదుగా 18, చెన్నై- తిరుపతి శ్రీకాళహస్తి మీదుగా 10, కాంచీపురం -తిరుపతి 9, తంబ్రాంమ్ 4, సేలం -తిరుపతి 4, తిరుపతి -తిరుచి వయా వేలూరు 2, కోయంబత్తూర్ - తిరుపతి 4, కుంభకోణం తిరుపతి 2, తంజావూరు -తిరుపతి 2, తిరుచి -తిరుపతి వయా చెన్నై మీదుగా 2, నాగపట్నం -తిరుపతి 3, క్రిష్ణగిరి -తిరుపతి 5, హెూరూరు -తిరుపతి 06, హెూసూరు -తిరుపతి మధ్య 2 రెండు సర్వీసులు నడిపేలా రెండు రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఆర్ఎం. చంగల్ రెడ్డి, డిప్యూటీ సిటిఎం భాస్కర్ రెడ్డి, అలిపిరి, తిరుపతి, మంగళం డిపోల డిఎం లు, తమిళనాడుకు చెందిన ఆర్టీసీ అధికారులు మోహన్, గుణశేఖరన్, గణపతి, సెల్వం, మనీ, నటరాజన్, మంజునాథన్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి-సోమల: సోమల వీఆర్ఏ సంఘం ఎన్నికను బుధవారం ఆ సంఘం సభ్యులు నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం చిత్తూరు జిల్లా గౌరవ అధ్యక్షులు వై.లక్ష్మణ, జిల్లా అధ్యక్షులు కోదండస్వాములు హాజరై ఎన్నికలు పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమలౌతోన్న ఏపీలో కూడా వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. పే స్కేల్, నామినీ, విద్యార్హతను బట్టి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వీఆర్వో, అటెండర్, వాచ్మెన్లుగా గ్రామ సేవకులను పదోన్నతులు కల్పించాలని కోరారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షులుగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా

ఎన్నికైన వీఆర్ఏల సంఘం సభ్యులు

యువరాజ్, ప్రధాన కార్యదర్శిగా కరిరప్ప, కోశాధికారిగా మాలిని బీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తూ సమస్యల పరిష్కారం కోసం తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో శేఖర్, మునీశ్వర, లలిత, సుగుణ, షమీల పాల్గొన్నారు.

బిసి హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి-శాంతిపురం: రాళ్లబూదుగూరులోని బిసి హాస్టల్ను కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పరిశీలించారు. హాస్టల్లోని వసతులు గురించి పిల్లలకు అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ భవనాన్ని మొత్తం పరిశీలించి అవసరమైన మరమ్మత్తులను చేయించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూసుకోవాలని హాస్టల్ వార్డెన్కు సూచించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు నూతన హాస్టల్ నిర్మాణం కొరకు చర్యలు చేపట్టాలని కడా ఆఫీసర్ను కోరారు. ఈ సందర్భంగా స్పందిస్తూ ఈ విషయంపై ప్రభుత్వానికి ముందుగానే నివేదిక అందించామని కొత్త హాస్టల్ భవన నిర్మాణం కొరకు అనుమతులు కూడా వచ్చాయన్నారు. త్వరలోనే నిర్మాణానికి

అధికారులకు సూచనలిస్తున్న కడా పీడీ

కావాల్సిన పనులు కూడా చేపడతామని తెలిపారు. అంతవరకు విద్యార్థులు వుండడానికి ఇప్పుడున్న భవనాన్ని మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్, పిఆర్ ఏఈ కృష్ణయ్య, ఆర్టీడబ్ల్యూఎస్ డీఈ పురుషోత్తం, అధికారులు మనోజ్, మీనాక్షి, వనిత, సర్పంచ్ లక్ష్మీ మురుగేష్, నాయకులు జయరాజు, మురళి, నారాయణ పలువురు పాల్గొన్నారు.

వృత్తిదారుల సమస్యలు పరిష్కరించండి

• కమిషనర్కు వినతి

ప్రజాశక్తి-పుంగనూరు: చెరువు, వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ అధ్యక్షులు కృష్ణమూర్తి కమిషనర్ను కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వారి సమస్యలు పరిష్కరించాలని బుధవారం వినతిపత్రం కమిషనర్ మధుసూదన్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్న చెరువులను కాపాడాలని కోరారు. పుంగనూరు చెరువు పరిసర ప్రాంతాలలో ఆక్రమణలు, వ్యర్థ పదార్థాలతో చెరువును దుర్గంధ భరితం చేశారని ఆరోపించారు. పాత భవనాలను కూల్చివేసిన

వాటి వ్యర్థాలను కొందరు చెరువులో దింపడం జరుగుతుంది. కొత్త మంది, ఇసుక మట్టిని ట్రాక్టర్లతో ఇతర వాహనాలతో పుంగనూరు చెరువులో పడ వేస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో ప్రజలకు తీవ్రమైన నష్టం జరిగే ప్రమాదం ఉన్నదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వీటిపై వెంటనే చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి వెంకటేశ్వర మత్స్య సహకార సంఘం సభ్యులతో పాటు, నాయకులు పటాన్ అయూబ్ ఖాన్, గంపల గంగరాజు, జి.కామేశ్వర, పి.దొరస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి: భాస్కర్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: చిత్తూరు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పోటుగారి భాస్కర్ అన్నారు. ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షర్మిల రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన వెదురుకుప్పంలో విలేకరులతో మాట్లాడారు. రెండో దఫా కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులుగా నియమించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నమ్మకంతో తనకు పదవి ఇచ్చినందుకు పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

వైభవంగా గంగ జాతర

ప్రజాశక్తి-విజయపురం(నగరి): ఏటా నిర్వహించే గంగ జాతర నగరిలో అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి పసుపు ముద్దతో తయారు చేసిన అమ్మవారి రూపాన్ని నిర్వాహకులు పట్టణంలో ఊరేగించారు. చావిడి వద్ద గంగమ్మను ప్రతిష్ఠించారు. బుధవారం వేకువ జాము నుంచే భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అమ్మవారికి పొంగళ్ళు పెట్టి సారె సమర్పించారు. అమ్మవారి జాతరలో మాజీ మంత్రి ఆర్కె రోజా, ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ వేర్వేరుగా వచ్చి పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి-కుప్పం టౌన్: మండలంలోని నడుమూరు పంచాయతీ బోధగుట్టపల్లి గ్రామంలో బుధవారం డ్రైనేజీ నిర్మాణాన్ని ప్రారంభించారు. కుప్పం మండల టిడిపి అధ్యక్షులు ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పిఎస్ మునిరత్నం, కడా పీడీ వికాస్ మరమత్ లు పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఆయన సొంత నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేసినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, శాంతారామ్, డాక్టర్ వెంకటేష్, సత్యేంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని బుక్కా పట్నం పంచాయతీ పిచ్చిరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ ముని రాజారెడ్డిని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి బుధవారం పరామర్శించారు. మునిరాజా రెడ్డికి గత కొద్ది రోజులుగా అనారోగ్యం కారణంగా చికిత్స చేసుకుంటుండగా విషయం తెలుసుకున్న నారాయణస్వామి ఆ గ్రామానికి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఎంపీపీ అనిత, బాబు రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, రామచంద్రారెడ్డి, లోకేష్, కుట్టి పాల్గొన్నారు.

'పారిశుద్ధ్యానికి ప్రాముఖ్యత'

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ప్రజలు పూర్తి ఆయురారోగ్యాలతో ఉండడానికి పారిశుద్ధ్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి తెలిపారు. బుధవారం చెక్కునత్తం పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రజల ఆరోగ్య దృష్ట్యా పరిస్థితి పనులను చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా కుప్పం మండలం గుడ్లనాయనపల్లి పంచాయతీ పరిధిలో సర్పంచ్ ఝాన్సీరాణి గిరిప్రసాద్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. ఊరినాయనపల్లి, కొత్తూరు గ్రామాలలో వీధి దీపాలను మరమ్మత్తులు చేయడం, డ్రైనేజీలను, నీటి తొట్టెలను శుభ్రపరిచారు. పంచాయతీ పరిధిలో పిచ్చి మొక్కలను తీసివేసి, వీధులను శుభ్రం చేయించారు.

దాతృత్వం చాటుకున్న కాంట్రాక్ట్ సిబ్బంది

ఆర్థిక సాయం అందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ద్రావిడ విశ్వవిద్యాలయ తాత్కాలిక సిబ్బంది తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. విశ్వవిద్యాలయంలో తోటమాలిగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ గత కొద్ది రోజులకు ముందు ఆత్మహత్య ప్రయత్నం చేసిన విషయం విధితమే. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితునికి మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో తాత్కాలిక సిబ్బంది ఐక్యమై తమ వంతుగా చందాలు వేసుకొని రూ.41వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-విజయపురం: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని అంగన్వాడీ సూపర్వైజర్ లక్ష్మి అన్నారు. మండలంలోని కేవీ పురం పంచాయతీ యం.అగరం అంగన్వాడీ కేంద్రాలలో "పోషన్ మాసోత్సవం" కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా గర్భవతులకు, బాలింతలు, పిల్లల తల్లి తండ్రులకు పౌష్టికాహారం ఆవశ్యకత గురించి అవగాన కల్పించారు. అనంతరం ఎత్తు, బరువులు, వ్యక్తిగత పరిశుభ్రత, 1000 రోజుల సంరక్షణ తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ దీప తదితరులు పాల్గొన్నారు.

విజయపురంలో

పలమనేరు: పట్టణంలోని బాలికోన్నత పాఠశాల ఆవరణలో బుధవారం పౌష్టికాహారంపై ఐసిడిఎస్ పలమనేరు ప్రాజెక్ట్ ఆఫీసర్ ఇందిర ప్రియదర్శిని ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

వైభవంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలంలోని ఎగువమాఘం గ్రామంలో వినాయక నిమజ్జనాన్ని ఘనంగా చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ హాజరైయ్యారు. ప్రత్యేక పూజలు అనంతరం వినాయక నిమజ్జనం అంగరంగ వైభవంగా జరిగింది.

సోమలలో పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జనం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి గ్రామంలో గణేష్ నిమజ్జనాన్ని ఎస్ఐ శివకుమార్ తన సిబ్బందితో పర్యవేక్షించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా గ్రామంలో ఘర్షణలు తలెత్తడంతో విషయం తెలుసుకున్న ఎస్ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఘర్షణలు,

సోమలలో

గొడవలు లేకుండా ప్రశాంతంగా విగ్రహ నిమజ్జన కార్యక్రమం చేసుకోవాలని వారికి సూచించారు. అనంతరం ఆ గ్రామంలో నాటు సారా, కర్ణాటక మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నట్లు ఆ గ్రామస్తులు ఎస్ఐ దృష్టికి తీసుకొచ్చారు. వివరాలు ఆరాదీసి చర్యలు తీసుకుంటానని ఎస్ఐ హామీ ఇచ్చారు.

పలమనేరు బలిజ సంఘం అధ్యక్షులుగా విఎం రూపేష్

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు బలిజ అభ్యుదయ సేవా సంఘం నూతన ప్రెసిడెంట్గా విఎం రూపేష్ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సుధాకర్, ప్రెసిడెంట్ పిజెసి బాబు, కార్యదర్శి కిరణ్, డాక్టర్ ఆకుల గజేంద్రప్రసాద్, ఏకే మూర్తి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు జయశంకర్, పిపిఎస్ కార్యదర్శి నరసింహులు, బలిజ సంఘం సభ్యులు అందరూ కలిసి సరస్వతి హోటల్ అధినేతను బలిజ సంఘం ప్రెసిడెంట్గా వి.ఎమ్ రూపేష్ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన ప్రెసిడెంట్ మాట్లాడుతూ.. బలిజ అభ్యుదయ సేవ సంఘం కోసం తన వంతు

సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సంఘం అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానన్నారు. సంఘం అనుకున్న లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మునిరాజా, రఘు, సుబ్బ నాగయ్య, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నూతన భవనంలో బ్యాంకు సేవలు

నూతన బ్యాంక్ భవనం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరు సప్తగిరి గ్రామీణ బ్యాంకును గురువారం నుంచి నూతన భవనంలోకి మార్పు చేస్తున్నట్లు ఆ బ్యాంకు మేనేజర్ జిఎస్ హరిహర ప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం 10గంటలకు బ్యాంక్ ఛైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్, జనరల్ మేనేజర్ ప్రభాహరన్, రీజనల్ మేనేజర్ ప్రకాష్ రత్నబాబు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు. ఖాతాదారులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

నేడు ఉచిత కంటి అద్దాల పంపిణీ

ప్రజాశక్తి-శాంతిపురం: శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయానున్నట్లు ఎంపిడివో కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులకు వివరాలను వెల్లడించారు. గత నెల 24న శాంతిపురం కళాశాలలో ఉచితంగా మెగా క్యాంపు నిర్వహించగా అందులో 575మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. అందులో 338మంది కంటి అద్దాలు వాడాల్సి ఉందని వైద్యులు సూచించారు. అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేసేందుకు గురువారం కళాశాలలో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వివరించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పలమనేరు: విజయవాడలోని వరద బాధితులకు ఓ సామాన్య రైతు తన వంతు సాయంగా రూ.10వేల చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్కు అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని టి.వడ్డూరు పంచాయతీ బెరపల్లికి చెందిన రైతు వెంకటరమణారెడ్డి తన వంతుగా రూ.10వేల చెక్కును బుధవారం టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకుల చేతికి అందించి సీఎం రిలీఫ్ ఫండ్కు ఇవ్వాలని కోరారు. కాగా రైతును పలువురు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు రెడ్డి, బాబు, రామచంద్ర తదితరులు ఉన్నారు.

ఘనంగా మిథున్రెడ్డి పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రాజంపేట ఎంపి మిథున్రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో వైసీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు కిషోర్కుమార్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. భారీ ఎత్తున కేక్ కట్ చేసి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మణి రాజ్, గోపి, జస్వంత్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్దనున్న వైఎస్సార్ విగ్రహం వద్ద ఎంపి మిథున్రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఎంపిపి ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. సర్పంచులు రెడ్డప్ప, వెంకటరమణ, మాజీ సర్పంచ్ శ్రీరాములు, నాయకులు వెంకటరమణ, కేసి తదితరులు పాల్గొన్నారు.

కుప్పం టౌన్: ఎంపి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను పట్టణంలోని వైసిపి కార్యాలయం వద్ద పురపాలక సంఘం అధ్యక్షులు డాక్టర్ సుధీర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి, అభిమానులకు పంచిపెట్టారు.

కార్వేటినగరం: రాజంపేట ఎంపి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం

పుంగనూరులో

మండల కేంద్రంలో ఎంపీపీ లత బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, ప్రభాకరెడ్డి, గోపి, పురంధర్, వెంకటరత్నం, పవన్కుమార్, గోపినాధ్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు: ఎంపి మిథున్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని బస్టాండ్లో వైఎస్సార్ విగ్రహం ఎదుట బుధవారం వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేపట్టారు. ముఖ్య అతిథిగా చిత్తూరు మాజీ ఎంపి ఎన్.రెడ్డప్ప పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీం బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పక్రుద్దీన్ షరీఫ్, మున్సిపల్ వైస్ చైర్మన్ సిఆర్ లలిత, కౌన్సిలర్లు అమ్ము, కిజార్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కాంట్రాక్టు లెక్చరర్ల వినతి

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కాంట్రాక్టు లెక్చరర్లు స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిని కలిసి బుధవారం వినతి పత్రం అందించారు. కాంట్రాక్టు లెక్చరర్ల రెగులరైజేషన్ అంశాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, సీఎం దృష్టికి తీసుకెళ్లి సహకరించాలని ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేని కోరారు. తన వంతుగా పరిష్కారానికి తప్పక చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్లు గురు ప్రసాద్

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న లెక్చరర్లు

రెడ్డి, భాస్కర్ రెడ్డి, నాగేంద్ర కుమార్, లింగమయ్య, సురేష్, నూర్జాన్, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్ సెట్ అడ్మిషన్ల కన్వీనర్గా ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఏపీ ఆర్ సెట్ 2023 –24 అడ్మిషన్ల కన్వీనర్ గా ఎస్వీయూ ఓఆర్ఐ విభాగ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వారిని కన్వీనర్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఏపీ ఆర్ సెట్ ప్రవేశ పరీక్షలు పూర్తి అయి, ర్యాంకులు ప్రకటించారు. ఈ క్రమంలో అడ్మిషన్లు నిర్వహించాల్సి వుంది. గతంలోనూ ఏపీ ఆర్ సెట్ –2021 కో– కన్వీనర్ గా ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు వ్యవహరించిన అనుభవం వుంది. ఈ నేపథ్యంలో ఈ రోజు అమరావతిలో ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ నెల 15 వ తేదీ నుంచి తొలిదశ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించే విధంగా నిర్ణయం తీసుకున్నారని, ఈ నెలాఖరులోగా తొలిదశ అడ్మిషన్లు పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ఏపీ ఆర్ సెట్ అడ్మిషన్ల కన్వీనర్ తెలిపారు.

మహిళలు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -దొరవారిసత్రం: 35 ఏళ్లు దాటిన మహిళలందరూ తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పిలుపు నిచ్చారు. దొరవారి సత్రం పిహెచ్సి పరిధిలోని తనియాళి గ్రామ సచివాలయంలో బుధవారం ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. పింక్ బస్సును పరిశీలించి, అక్కడ అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సు ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా కొనసాగుతోందన్నారు. క్యాంపునకు విశేషంగా ప్రజలు విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారని వివరించారు. పింక్ బస్

క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, దొరవారిసత్రం పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ వి.చైతన్య, స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.పద్మావతి, సర్పంచులు టి.సుబ్బమ్మ, ఎన్.చెంగయ్య, స్థానిక నాయకులు నాగేంద్ర నాయుడు, వీరరాఘవులు, నర్సింగ్ సిబ్బంది, స్థానిక డాక్టర్ చంద్రకళ, ఎంఎల్హెచ్పి, జ్యోతమ్మ,ఏఎన్ఎం, హారతి, సౌజన్య, ఆశా వర్కర్లు అమరావతి, మంజుల పాల్గొన్నారు.

పిహెచ్సికి ఇసుజు వితరణ

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా పరిశ్రమ, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా సుమారు 4 లక్షల రూపాయల విలువైన వైద్య పరికరాలను చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వితరణ ఇచ్చింది. బుధవారం ఉదయం ఆస్పత్రి ఆవరణలో ఇసుజు వైస్ ప్రెసిడెంట్ సెంథిల్ మనోహర్, జనరల్ మేనేజర్ తకాషి రికుకావా, శ్రీసిటీ ప్రతినిధులు నిరీషా సన్నారెడ్డి, రమేష్ కుమార్ సమక్షంలో పరిశ్రమ ప్రతినిధులు ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనితకు పరికరాలు అందచేశారు. వీటిలో ఏసి, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషిన్, ఆపరేషన్ టేబుల్, స్ట్రెచ్చర్ ట్రాలీ, బిపి యంత్రాలు, వాక్యూమ్ క్లీనర్లు, సెలైన్ స్టాండ్లు, ఇతర పరికరాలు వున్నాయి. ఇసుజు సీఎస్సార్ చొరవను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినం దించారు. శ్రీసిటీ, పొరుగు ప్రాం తాలలో ఆరోగ్య మౌలిక సదుపా యాలను మెరు గు పరచడానికి శ్రీసిటీ పరిశ్రమల సహకారంతో తాము నిరం తరంగా కృషి చేస్తామన్నారు. వితరణ వైద్య పరికరాల ద్వారా పేద రోగులకు మరింత మెరుగైన వైద్యం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీసిటీ నిరంతర సహకారానికి ఆసుపత్రి వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ సురేంద్ర కుమార్, ఇసుజు, చిన్న పాండూరు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను విరమించుకోవాలి: సిఐటియు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని సిఐటియు, ఏఐటియుసి నాయకులు స్థానిక అంబేద్కర్ సర్కిల్లో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి మహేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ స్టీల్ ప్లాంట్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైందని, రోజు రోజుకు పరిస్థితి దిగజారి పోతోందన్నారు. మూడు బ్లాస్ట్ ఫర్నిచర్ గతంలో ఒక బ్లాస్ట్ మూతపడగా ఇప్పుడు మరో బ్లాస్ట్ ఫర్నిచర్ కూడా మూత పడిందన్నారు. విశాఖ స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం 73 లక్షల టన్నులు ఉండగా, గత సంవత్సరం 45 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అయ్యిందని, ఈ ఏడాది ఉత్పత్తి ఇంకా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పడిన నాటి నుండి కేంద్ర ప్రభుత్వం 9 వేల కోట్ల రూపాయలు మాత్రమే పెట్టుబడి పెట్టిందన్నారు. కానీ విశాఖ స్టీల్

నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు, ఏఐటియుసి నాయకులు

ప్లాంట్ ఇప్పటి వరకు పన్నులు, డివిడెండ్ రూపంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.58 వేల కోట్లు చెల్లించింద న్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ను సమర్థవంతంగా నడప డానికి ఎలాంటి చర్యలు చేపట్టక పోగా ప్లాంట్ ను నాశనం చేయడా నికి అన్ని ప్రయత్నాలు చేయడం దారుణం అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం టిడిపి నాయక త్వం మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడాలని కోరారు. లేని పక్షంలో తాము ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎ విజయ్, పి భాస్కర్, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం, దళిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య, వడమాలపేట మండల కార్యదర్శి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు యాషన్ బాష, రమేష్, కృష్ణమూర్తి, వెంకటేష్, ధన, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆరోపణలపై దర్యాప్తు చేయండి..

పోలీసులకు దళిత సంఘం వినతి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై కుట్రకోణం దాగి వుందని దీనిపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ ఎస్ఐ విశ్వనాథనాయుడుకు దళిత సంఘం నాయకులు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలను నిరసిస్తూ అందులో దాగివున్న కుట్రను బయటికి తీసి న్యాయం చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడు మండలాల దళిత నాయకులు పాల్గొన్నారు. స్పందించిన ఎస్ఐ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఎస్పి దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడు మండలాల దళిత నాయకులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మండలంలోని సీఆర్ కండ్రిగలో వెలుగుచూసింది. గ్రామస్తుల కథనం మేరకు.. సీఆర్ కండ్రిగకు చెందిన బండి నెహ్రూ రెడ్డి(31) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అందరితో కలుపుగోలు తనంగా తిరిగే నెహ్రూరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం తెలుసుకున్న పలువురు దిగ్భ్రాంతికి గురైయ్యారు. ఇతనికి ఇంకా పెళ్లి కాలేదు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

'ఎస్సి వర్గీకరణ విరమించుకునే వరకు ఉద్యమం'

ప్రజాశక్తి -కోట : భారతదేశం వ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ పూర్తిగా అంతమయ్యే వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి నాయకులు, న్యాయవాది మోహన్ అంబేద్కర్, అరవ పార్వతయ్య, విజయకుమార్ లు అన్నారు. బుధవారం కోట మండలంలోని కోట క్రాస్ రోడ్డు నుండి కోట అంబేద్కర్ విగ్రహం వరకు భారీ సంఖ్యలో నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. ముఖ్య అతిథులుగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు అరవ పార్వతయ్య, న్యాయవాది మోహన్ అంబేద్కర్, విజయ కుమార్లు హాజరయ్యారు. మొట్టమొదటగా కోట క్రాస్ రోడ్ లో కోట వాకాడు చిట్టమూరు మండలాల నుండి వచ్చిన మాలలందరూ ఏకమై ర్యాలీగా కోట మహాత్మా గాంధీబొమ్మ వరకు చేరుకుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలువురు సీనియర్ వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్, డాక్టర్ రామకృష్ణయ్య, డాక్టర్ రవికుమార్, ఎస్సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మీజూరు మాధవ్ పాల్గొన్నారు.

వైసిపి ఆగడాలను అడ్డుకుంటాం..

భూ బాధితులను ఆదుకుంటామని జనసేన భరోసా

ప్రజాశక్తి -రామచంద్రాపురం: వైసిపి ఆగడాలను అడ్డుకుని భూ బాధితులకు అండగా నిలుస్తామని జనసేన నాయకులు తెలిపారు. తిరుచానూరు భూ బాధితులకు అండగా నిలబడితే తనపై కబ్జా ఆరోపణలు చేయడం దుర్మార్గమని చంద్రగిరి నియోజకవర్గం జనసేన ఇన్ఛార్జి దేవర మనోహర్ మండిపడ్డారు. బుధవారం జనసేన నేతలు, భూ బాధితులతో కలిసి తిరుచానూరులో అన్యాక్రాంతమైన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులతో కలిసి అన్యాక్రాంతమైన ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళితే వైసీపీ కబ్జా దారులు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమాలతో నిండిపోయిన వైసీపీ ప్రభుత్వం మారితే న్యాయం జరుగుతుందని ఎదురు చూసిన భూ బాధితుడు రాజేంద్ర ప్రసాద్ న్యాయం జరిగేలా లేదని వాపోయారు. బాధితుడు కోసం జనసేన తరపున అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. పక్కా రికార్డ్స్తో కొనుగోలు చేసిన భూమిని శానంబట్లకు చెందిన వైసీపీ నేత సుధాకర్ రెడ్డి కబ్జా చేశాడని ఆరోపించారు. నకిలీ పత్రాలతో ఇంటి పన్ను, కరెంట్ మీటర్లు అమర్చుకున్నాడని వ్యాఖ్యానించారు. డిప్యూటీ సిఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి బాధితుని న్యాయం చేస్తామన్నారు. న్యాయం జరగకపోతే ఆమరణ నిరహార దీక్షకు సిద్ధమని స్పష్టం చేశారు.

IN THE COURT OF III ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION),CHITTOOR
I.A.No. 118 of 2023
O.S.No. 840 of 2023

Between
R.Bhaskar Naidu ...Petitioner/Plaintiff
And
A.Venkatesh & 8 Others
...Respondents/Defendants

NOTICE TO
9th RESPONDENT/9th DEFENDANT

To
A.MUNISANKAR,
S/o A.Poomani Gounder,
R/at Paachakooru Village,
Bodhuguttapalle Post,
Yadamari Mandal,
Chittoor District, AP-517422

Sir,
Pleass take notice that in the above petition filed by the Petitioner/Plaintiff against you under **ORDER 39 RULE 1 AND 2 READ WITH SEC.151 C.P.C** and posted to **17-10-2024** for your appearance.If you donot appear on the above date at **10-30 A.M**. either in person or through an advocate,the matter will be decided exparte.

S/d- **B.NARASIMHULU NAIDU**
Advocate for Petitioner/Plaintiff
Chittoor, Date: 10-09-2024